

తరలింపునకు ఆదేశం

కాలుష్య పరిశ్రమలకు వ్యతిరేకంగా 19 ఏళ్ల పోరాటం ఫలించింది. హైకోర్టు తీర్పు స్థానికుల్లో ఆనందం నింపింది. 10లో▸



చర్యలు తీసుకోండి

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములు కాపాడాలని శంకర్‌పల్లి మండలం శేరిగూడ గ్రామస్తులు నిరసన చేపట్టారు. 10లో▸



రోడ్డుపై గుంతలు..

వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. అడుగడుగునా గుంతలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



కేతిరెడ్డిపల్లిలో మురుగునీటి కుంటను పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌మోహన్

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి పంచాయతీని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ పక్కన ఉన్న మురికి కుంటను పరిశీలించి మురుగు నీరు ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. వెంటనే శుభ్రం చేయించాలని పంచాయతీ అధికారి తారాబాయికి సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు నీటి గుంతలు, మురికి కాలువలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సతీష్‌రెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత



మొక్క నాటుతున్న కమ్లేష్ పటేల్, బౌద్ధ ప్రముఖులు

నందిగామ: సమాజంలోని ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ రామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమ్లేష్ పటేల్ (దాజీ) అన్నారు. కన్హా శాంతి వనంలో శుక్రవారం కమ్లేష్ పటేల్ 69వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీలంక దేశానికి చెందిన అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య అదనపు సెక్రటరీ జనరల్, దలైలామా ప్రతినిధి దమింద పోరగే హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు దేశాలు, రాష్ట్రాలకు చెందిన వేలాది మంది అభ్యాసీల సమక్షంలో సామూహిక ధ్యానం చేశారు. ధ్యానం, ధ్యానంతో ప్రయోజనం గురించి వివరించారు. అనంతరం బుద్ధగయ నుంచి తీసుకొచ్చిన మహాబోధి మొక్కను కన్హా శాంతి వనంలో నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలు దేశాల నుంచి వచ్చిన అభ్యాసీలు, బౌద్ధ ప్రముఖులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో వీఎం హోమ్ ప్రిన్సిపాల్



ప్రభుదాస్

హుడాకాంప్లెక్స్: ఏసీబీ వలకు మరో అవినీతి చేప చిక్కింది. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ సహా మరో ఉద్యోగి ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభుదాస్ హోమ్‌కు నిత్యావసరాలు సరఫరా చేసే ఫుడ్ కాంట్రాక్టర్ నుంచి రూ.29 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. సరఫరా చేసిన వస్తువులకు మించి బిల్లులు వేయడంతో పాటు, కాంట్రాక్టర్ నుంచి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో అతను ఏసీబీని ఆశ్రయించారు. దీంతో వలపన్నిన ఏసీబీ అధికారులు శుక్రవారం అతడిని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు.

డిస్కంలో ఇంజనీర్ల బదిలీలకు రంగం సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లో ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన ఇంజనీర్ల బదిలీకి రంగం సిద్ధమైంది. రెండేళ్లు దాటిన ప్రతి ఒక్కరినీ ఒక సర్కిల్ నుంచి మరో సర్కిల్‌కు బదిలీ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఫోకల్ పోస్టుల్లో పని చేసిన వారిని, ఇక నాన్ ఫోకల్ పోస్టుల్లోకి బదిలీ చేయనున్నారు. ఏఈ మొదలు డీఈ వరకు బదిలీ అవుతారు. అన్ని సర్కిళ్లలో 50 శాతం మంది ఉద్యోగులకు స్థానచలనం కల్పించనున్నారు. కాగా..ఫోకల్ పోస్టులను దక్కించుకునేందుకు పలువురు ఇంజనీర్లు భారీ ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు పరిచయం ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కోరుకున్న ప్రాంతంలో పోస్టింగ్ కోసం కొందరు సీఎండీపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిసింది.

సహనానికి పరీక్ష

పెరుగుతున్న జ్వరపీడితులు

- ఆస్పత్రులకు బాధితుల క్యూ
- అంతకంతకూ పెరుగుతున్న సంఖ్య
- గంటల తరబడి తప్పని నిరీక్షణ
- వేధిస్తున్న వైద్య సిబ్బంది కొరత

వర్షాకాలం నేపథ్యంలో ప్రస్తుతం గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వైరల్ ఫీవర్లతో బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లాలోని ఆయా ప్రభుత్వ ఆస్పత్రులను 'సాక్షి' విజిట్ చేసింది. ఓపీ సంఖ్య భారీగా పెరిగింది. వైద్య పరీక్షల కోసం బాధితులు ఉదయం నుంచే రావడం కనిపించింది. వ్యాధి నిర్ధారణ టెస్టుల కోసం గంటల తరబడి నిరీక్షించారు. వచ్చిన బాధితులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి పంపించారు. పలుచోట్ల యంత్రాలు లేక టెస్టులను ప్రైవేటుకు రిఫర్ చేశారు. మరికొన్ని చోట్ల వైద్య సిబ్బంది తగినంతగా లేక ఉన్నవారిపై భారం పడుతోంది.

సాక్షి విజిట్



మొయినాబాద్ పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చిన బాధితులు

ఫీవర్‌తో పీహెచ్‌సీకి క్యూ

మొయినాబాద్: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం 'సాక్షి' విజిట్ నిర్వహించింది. ఆస్పత్రికి వచ్చిన వారిలో ఎక్కువ మంది వైరల్ ఫీవర్‌తోనే బాధపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే రోగులు ఆస్పత్రికి క్యూ కట్టారు. సాధారణంగా ఇక్కడ రోజుకు 70–80 మంది ఓపీ ఉంటుంది. ఇటీవల వైరల్ ఫీవర్, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఓపీ 120–130కి పెరిగింది. వైరల్ ఫీవర్‌తోపాటు సీజనల్ వ్యాధులు, కుక్కకాటు, ప్రమాదాలకు సంబంధించిన కేసులు వచ్చాయి. జ్వరంతో ఆస్పత్రికి వచ్చిన వారికి డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు డెంగీ, మలేరియా కేసులు ఏమీ నమోదు కాలేదని వైద్యులు తెలిపారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రోగులతో కిటకిట

యాచారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) రోగులతో కిటకిటలాడుతోంది. వాంతులు, విరేచనాలు, విషజ్వరాలు, కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఆస్పత్రికి క్యూ కట్టారు. నిత్యం వివిధ గ్రామాలకు చెందిన 200 మందికి పైగా రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. విషజ్వరాలతో వచ్చిన వారికి సరైన నిర్ధారణ చేసే యంత్రాలు లేకపోవడంతో వైద్యులు రక్త పరీక్షల కోసం బయటికి రిఫర్ చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడం, వాతావరణ మార్పులతో జ్వరాలు సోకుతున్నాయని ఆస్పత్రి వైద్యాధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు.

కిటకిటలాడుతున్న యాచారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం



పరీక్షల కోసం నిరీక్షణ

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి నూతన భవనం నిర్మిస్తుండటంతో ప్రస్తుతం చిన్న భవనంలో కొనసాగిస్తున్నారు. రోగుల సంఖ్య పెరుగుతుండడంతో డాక్టర్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రి భవనం చిన్నగా ఉండటంతో ఇన్‌పేషంట్లను చేర్చుకోవడం లేదు. ప్రస్తుతం నిత్యం దాదాపు 200 నుంచి 250 మంది దాకా చికిత్స నిమిత్తం వస్తున్నారు. ఆస్పత్రిని శుక్రవారం విజిట్ చేయగా చాలామంది జ్వరంతో బాధపడుతూ రావడం కనిపించింది. రక్త పరీక్షల కోసం ల్యాబ్ వద్ద పెద్ద సంఖ్యలో నిరీక్షించారు. డాక్టర్‌లు పరిక్షిత్ నరేందర్, నాగరాజు, జయశ్రీ రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు.



ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రిలో రక్త పరీక్షల కోసం క్యూ

పెరుగుతున్న రోగుల సంఖ్య



రోగుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి డాక్టర్ శిల్ప

మాడ్గుల: మండలంలోని ప్రభుత్వాస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతోంది. గతంలో చికిత్స నిమిత్తం నిత్యం సుమారు 100 మంది వరకు వచ్చేవారు. ప్రస్తుతం 150కి పైగా వస్తున్నారు. రెండు మూడు రోజులు జ్వరం తగ్గని వారికి డెంగీ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు మలేరియా, డెంగీ కేసులు నమోదు కాలేదని వైద్యాధికారి డాక్టర్ శిల్ప వివరించారు. 34 పంచాయతీలున్న మండలంలో ప్రస్తుతం ఐదు పడకలతో మాత్రమే ఈ ప్రాథమిక ఆస్పత్రి ఉంది. జనాభా మేరకు 50 పడకలకు పెంచి సేవలందించాలని కోరుతున్నారు.



వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న బాధితులు

సిబ్బంది కొరతతో ఇబ్బంది

మహేశ్వరం: మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రికి విష జ్వరాల బారినపడి బాధపడుతున్న వారు ఎక్కువగా వస్తున్నారు. శుక్రవారం సాక్షి విజిట్ చేయగా 362 మందికి ఓపీ పరీక్షలు నిర్వహించగా అందులో 117 కేసులు విషజ్వరాలకు సంబంధించినవి నమోదయ్యాయి. ఆస్పత్రిలో సుమారు 20 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 12 మంది మాత్రమే ఉన్నారు. 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న వైద్యులు షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగులకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విష జ్వరాల కేసులే ఎక్కువ



ఎక్కువగా విష జ్వరాలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు ఇతర జ్వరాలకు సంబంధించిన బాధితులు వస్తున్నారు. అన్ని పరీక్షలు నిర్వహించి సరిపడా మందులు అందిస్తున్నాం. నిత్యం 350 నుంచి 400 ఓపీ కేసులు నమోదవుతున్నాయి. త్వరలో మరింత మంది వైద్యులు రాబోతున్నారు. సేవలను విస్తరిస్తాం.

– డా.అమీర్ సిద్దీఖీ, ఆస్పత్రి సూపరింటెండెంట్

పరీక్షలు చేసి మందులు ఇచ్చి

షాబాద్: మండల పరిధిలోని చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం 80 నుంచి 110 మంది వరకు వస్తున్నారు. శుక్రవారం ఆస్పత్రిని విజిట్ చేయగా బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేస్తున్నారు. మెరుగైన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ స్వర్ణలత తెలిపారు. ఇప్పటివరకు డెంగీ, మలేరియా వంటి కేసులు నమోదు కాలేదన్నారు. సీజనల్ వ్యాధులపై సర్వే నిర్వహించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యం కోసం..



బాలాపూర్ ఆస్పత్రి వద్ద మందుల కోసం వేచి ఉన్న జనం

ఆస్పత్రికి బాధితుల బారులు

మీర్‌పేట: బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజు 150 నుంచి 200 మంది వరకు ఔట్‌పేషంట్లు వస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య సేవలు అందుతున్నాయి. నిత్యం దాదాపు 10 వరకు వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. యూపీహెచ్‌సీ పరిధిలో మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లతో పాటు జల్‌పల్లి మున్సిపాలిటీ ఉన్నాయి. దాదాపు 2.30 లక్షల వరకు జనాభా ఉండగా ఇందులో పేదలు నివసించే బస్తీలే అధికంగా ఉన్నాయి. జనాభాకు సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో కొన్నేళ్లుగా ఉన్నవారితోనే నెట్టుకొస్తున్నారు. వారిపై పనిభారం పడుతోంది.

పరిశుభ్రత తప్పనిసరి

వ్యాధులు ప్రబలే సీజన్ కావడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడంతో జ్వరాలు, ఇతర వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమ తెరలను వాడడంతో పాటు గోరువెచ్చని నీటిని తాగాలి. బయటి ఆహారానికి దూరంగా ఉండాలి.

– బాలమణి, బాలాపూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి

పెరిగిన ఓపీ సంఖ్య



జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులు అందిస్తున్న సిబ్బంది

కొత్తూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్ సూచించారు. పీహెచ్‌సీతో పాటు దాని పరిధిలోని ఏడు సబ్‌సెంటర్లలో నిత్యం వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డెంగీ, చికున్‌గున్యాతో పాటు ఇతర జ్వరాలకు సంబంధించిన పరీక్షలు, మందులు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. గతంలో రోజుకు 90 మంది ఔట్ పేషంట్లు వస్తుండగా ప్రస్తుతం 120 వరకు వస్తున్నట్లు చెప్పారు. వారిలో చాలా వరకు జ్వరాలతో బాధపడే వారే ఉన్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలో చికున్‌గున్యా, డెంగీతోపాటు పలు వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.



రాచులూరు పీహెచ్‌సీలో వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న సిబ్బంది

కుక్కకాటు, పాముకాటు మందుల్లేవ్

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరు పీహెచ్‌సీలో నిత్యం 60 మంది వరకు రోగులను పరీక్షిస్తున్నారు. కుక్కకాటు, పాము కాటుకు మినహా అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేకంగా ఫ్రిడ్జి లేక కుక్కకాటు, పాము కాటు మందులు తెప్పించలేకపోతున్నామని సిబ్బంది తెలిపారు. నైట్ వాచ్‌మన్, శుభ్రం చేయడానికి ఆయాల నియామకం లేదు. దీంతో ఇబ్బందిగా ఉందంటున్నారు. తాగునీటి సౌకర్యం లేక ఇంటి నుంచే సిబ్బంది, వైద్యులు బాటిళ్లలో నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. రోగులకు అక్కడి నల్లా నీరే దిక్కు. ప్రత్యేకంగా తాగునీటి శుద్ధి చేసే ఆర్‌ఓ ఫిల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ పద్మజారమణ

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

డీడబ్ల్యూఓ పద్మజా రమణ

ఆమనగల్లు: నేటి సుపోషిత కిశోర బాలికలే రేపటి శక్తివంతమైన మహిళలు అని జిల్లా సంక్షేమాధికారిణి పద్మజారమణ అన్నారు. పోషకాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. పట్టణంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలకు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల, పోషక పదార్థాల మేళా నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు చేయించారు. పోషకాహారం తీసుకుంటామని మహిళలు, తల్లులు, అంగన్‌వాడీ టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పద్మజారమణ మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు. రోజూ ఆహారంలో చిరుధాన్యాలను తప్పక తీసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ఆమె వివరించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన చికిత్సలు అందించి బాలామృతం ప్లస్ అందిస్తున్నామని అన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ కమిషనర్ వసంత, తహసీల్దార్ లలిత, ఎంపీడీఓ మాధురి, మెడికల్ ఆఫీసర్ డా.పరిక్షిత్ నరేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

'కొండా' బాపూజీ పోరాటం స్ఫూర్తిదాయకం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాట పటిమ మరువలేనిదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా మీర్‌పేట చందన చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి స్వశక్తితో ఎదిగిన మహోన్నత వ్యక్తి లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ సమాజానికి ఆయన ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. పద్మశాలీ సంఘం విజ్ఞప్తి మేరకు జిల్లాలో ఎకరం స్థలంతో పాటు కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు తనవంతు కృషిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతానని తెలిపారు. అనంతరం లక్ష్మణ్‌బాపూజీ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రఘురాంనేత, గాయత్రినగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాకం సుధాకర్‌నేత, ప్రతినిధులు పున్నా కృష్ణ, వింజమూరి అయ్యన్న, గాజుల మధు, రామునేత, సంతోష్, గాజుల శ్రీహరి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

పదవులను లెక్కచేయని త్యాగధనుడు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు లక్ష్మణ్‌బాపూజీ అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌తో కలిసి ఆయన లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల చైతన్యానికి, ఆత్మగౌరవానికి బాపూజీ ప్రతీక అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కొలన్ శంకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



చందన చెరువు కట్టపై విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు



నివాళి అర్పిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న శేరిగూడవాసులు

శంకర్‌పల్లి: ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములు కాపాడాలని మండలంలోని శేరిగూడ గ్రామస్తులు శుక్రవారం శంకర్‌పల్లి చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కార్యాలయం ఎదుట బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. శేరిగూడ గ్రామ రెవెన్యూ పరిధిలో వందల ఎకరాల్లో నది నాలా భూములు ఉన్నాయన్నారు. అయితే కొంతకాలంగా గ్రామంలోని ఇద్దరు వ్యక్తులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆ భూముల్లోని రైతులకు రూ.లక్షల్లో నగదు ముట్టజెప్పి లాక్కుంటున్నారని ఆరోపించారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని లేకపోతే సీఎం కార్యాలయం ముందు ధర్నా చేపడుతామని హెచ్చరించారు. గ్రామస్తులు ధర్నా చేస్తుండగా తహసీల్దార్ సురేందర్ బయటకు వచ్చి.. రైతులతో మాట్లాడారు. అధికారులను పంపి విచారణ జరిపి న్యాయం చేస్తానన్నారు. నిరసన తెలిపిన వారిలో గ్రామ మాజీ సర్పంచి సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచి ఇంద్రాసేనారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు చిక్కాడు

నందిగామ: అధిక వడ్డీ ఆశ చూపి, రూ.2.60 కోట్లు వసూలు చేసి.. తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని నందిగామ పోలీసులు రిమాండ్ తరలించారు. ఎస్ఐ గోపాల కృష్ణ వివరాల ప్రకారం.. మేకగూడకు చెందిన మారేపల్లి మధుసూదన్ 2018 నుంచి గ్రామస్తులు, తెలిసిన వారి వద్ద అప్పులు తీసుకున్నాడు. వీరికి బాండ్లు, నోట్లు రాయించి ఇచ్చాడు. కొంత కాలం పాటు క్రమం తప్పకుండా వడ్డీలు చెల్లించడంతో మిగిలిన వారు కూడా నమ్మారు. ఇలా 22 మంది నుంచి సుమారు 2.60 కోట్లు తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత చెల్లింపులు ఆపేశాడు. డబ్బు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో నగరంలోని ఛత్రినాఖకు మకాం మార్చాడు. బాధితుల్లో ఒకరైన ప్రతాప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లోనే మధుసూదన్‌పై కేసు నమోదైంది. తప్పించుకు తిరుగుతున్న అతన్ని ఎట్టకేలకు పట్టుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

కాలుష్య కర్మాగారం.. తరలింపునకు ఆదేశం

కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థాలు అక్కడి రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఫ్యాక్టరీ బారినపడి పంటలు పూర్తిగా పాడయ్యాయి. పశువులు సైతం రోగాలతో మృత్యువాత పడ్డాయి. షాద్‌నగర్ పరిధిలో నెలకొన్న కాలుష్య పరిశ్రమలకు వ్యతిరేకంగా 19 ఏళ్లుగా పోరు చేస్తుండగా.. తాజాగా హైకోర్టు తీర్పు స్థానికుల్లో ఆనందాన్ని నింపింది.

- హైకోర్టు తీర్పుతో ఫలించిన సుదీర్ఘ పోరాటం
- అధికారులు స్పందిస్తేనే ఆశించిన ప్రయోజనం



కేశంపేట మండలం ఇప్పలపల్లిలో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమ

షాద్‌నగర్: నియోజకవర్గంలో దాదాపు అన్ని మండలాల్లో పరిశ్రమలున్నాయి. వీటిలో అత్యధికంగా కాలుష్యకార పరిశ్రమలు ఉండటం గమనార్హం. దీంతో వాటి నుంచి వెలువడిన రసాయనాలు, పొగతో పంట పొలాలు ఎండిపోవడం, పచ్చని చెట్లు నల్లబారిపోవడం, కాలుష్య నీటిని తాగి పశువులు మరణించడం సాధారణమయ్యాయి. 1975లో పారిశ్రామిక ప్రాంతంగా ఏర్పడగా.. అది కేవలం కొత్తూరు ప్రాంతానికి పరిమితమైంది. అనంతరం పరిశ్రమలు వందల్లోకి విస్తరించడంతో నందిగామ, షాద్‌నగర్, కొందుర్గు, కేశంపేటలు పారిశ్రామికంగా వృద్ధి చెందాయి. వీటిలో స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు విపరీతమైన కాలుష్యాన్ని బయటకు వ్యాప్తి చేస్తాయి. కనీస జాగ్రత్తలు పాటించడకుండా కొనసాగుతుండటంతో పరిసరాల్లో పంటలు పండించే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీనిపై ఎన్ని పోరాటాలు చేసినా ఫలితం శూన్యమైంది.

న్యాయవాది పోరాటం

షాద్‌నగర్ పరిధిలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమ కారణంగా రైతులు నష్టపోతున్నారు. దీంతో అన్నదాతల తరపున కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది తాండ్ర వీరేందర్‌రెడ్డి పోరాటాన్ని మొదలు పెట్టారు. నియోజకవర్గంలోని కాలుష్య పరిశ్రమలను ఇక్కడి నుంచి తరలించి, పర్యావరణాన్ని కాపాడాలని హైకోర్టు మెట్లెక్కి ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. 2009లో మొదలైన ఈ పోరాటం సుదీర్ఘంగా సాగి తాజాగా ఈ వ్యవహారం పై హైకోర్టు తీర్పు వెల్లడించింది.

ఇదే హైకోర్టు తీర్పు

స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను ఏడాదిలోగా తరలించాలంటూ ఇటీవల హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమలను తరలించిన తర్వాత నివేదికను హైకోర్టు జ్యుడిషియల్ రిజిస్ట్రార్‌కు సమర్పించాలని ఆదేశించింది. అదేవిధంగా పంట నష్టాలకు పరిహారంగా పరిశ్రమలు డిపాజిట్ చేసిన సొమ్మును రైతులకు పంపిణీ చేయాలని ధర్మాసనం తీర్పు వెల్లడించింది. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల ఈ ప్రాంతవాసులు, ముఖ్యంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతున్నారు.

త్వరగా తరలించాలి



మాకున్న కొద్దిపాటి పొలం ఇప్పలపల్లిలో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమ సమీపంలో ఉంది. పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యంతో పొలాలు నల్లబారుతున్నాయి. మేత మేస్తున్న పశువులు రోగాల బారిన పడుతున్నాయి. కాలుష్య పరిశ్రమలను తరలించాలి.

– బలరాం, దేవునిగుడితండా, కేశంపేట

న్యాయం గెలిచింది



స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి తరపున 19 ఏళ్ల క్రితం కోర్టులో కేసు వేశారు. న్యాయస్థానం పూర్తి స్థాయి విచారణ చేపట్టి తీర్పు వెల్లడించింది. చివరికి న్యాయమే గెలిచింది.

– వీరేందర్‌రెడ్డి, న్యాయవాది, షాద్‌నగర్

పని చేస్తుండగా ఫిట్స్..

కార్మికుడి దుర్మరణం



జస్విందర్ సింగ్ మృతదేహం

నందిగామ: పరిశ్రమలో పనిచేస్తున్న ఓ కార్మికుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మేకగూడలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. మేకగూడ శివారులోని ఏరోలైట్ పరిశ్రమలో కరుణాకర్‌రెడ్డి లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. కార్మికులు అవసరం ఏర్పడి ఈ నెల 20న సికింద్రబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో నలుగురు కార్మికులను తీసుకొని పరిశ్రమలో పనిలో పెట్టుకున్నాడు. అందులో మధ్యప్రదేశ్‌కు చెందిన జస్విందర్ సింగ్ భరాట్(30) ఉన్నాడు. గురువారం ఆయన పరిశ్రమలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఫిట్స్ రావడంతో కిందపడిపోయాడు. దీంతో పరిశ్రమ యాజమాన్యం, తోటి కార్మికులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాంట్రాక్టర్ కరుణాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అబ్బురపర్చిన నల్ల తాబేలు



మండలంలోని గౌరెల్లి గ్రామంలో గురువారం రాత్రి నల్ల రంగులో ఉన్న తాబేలు అబ్బురపర్చింది. సాధారణంగా ఇవి ముదురు గోధుమ, లేదా లేత ఆకు పచ్చ రంగుల్లో ఉంటాయి. కానీ పూర్తిగా నల్లరంగులో ఉండే తాబేలును చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లతో ఫొటోలు తీసుకున్నారు. గ్రామానికి ఆనుకుని ప్రవహిస్తున్న మూసీ కాల్వ నుంచి ఇది బయటకు వచ్చినట్లు తెలిపారు. తాము చూస్తుండగానే పంట పొలాల్లోకి వెళ్లిందని చెప్పారు.

– అబ్దుల్లాపూర్‌మెట్

పేకాట రాయుళ్ల అరెస్టు

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో పది మంది పేకాటరాయుళ్లను యాచారం పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. వారి వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ నివాస గృహంలో పేకాటాడుతున్నట్లు సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. పది మందిని అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రూ.23,410 నగదు ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కుషాయిగూడ: ఫైనాన్సియర్ల వేధింపులు తాళలేక ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జడ్చర్లకు చెందిన వీరేష్ (30) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి చర్లపల్లిలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య లలిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది రోజులుగా ఆటో సక్రమంగా నడవకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. శుక్రవారం ఉదయం ఫైనాన్స్ వ్యాపారి ఇంటికి వచ్చి డబ్బుల కోసం గొడవ చేయడంతో మనస్తాపానికి లోనైన వీరేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించగా పరీక్షించి వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

మహిళ బలవన్మరణం

మియాపూర్: తొమ్మిది అంతస్తుల భవనంపై నుంచి దూకి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ దుర్గా రామ లింగ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్ మయూరినగర్ కాలనీ, దివ్యశ్రీ శక్తి అపార్ట్‌మెంట్‌లో భర్త నెహ్రూ, కుమారుడితో కలిసి ఉంటున్న సాయి సింధూర(29) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. శుక్రవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ తొమ్మిదో అంతస్తు నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సాయి సింధూర మనస్తానికిలోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా ప్రస్తుతం ఆమె ఆరు మాసాల గర్భవతి అని తెలిసింది. మృతురాలి తండ్రి సూర్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై గుంతలు.. వాహనదారుల తంటాలు



ఇటీవల కురిసిన వర్షాలకు గౌరెల్లి–నాగోల్ మార్గంలో రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కుంట్లూర్ రాజీవ్‌గృహకల్ప వద్ద ఏర్పడిన భారీ గుంతతో రాత్రిళ్లు వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అక్కడ స్థానికులు చెట్ల కొమ్మలు ఉంచడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్ 10 నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై గుంతలను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

– అబ్దుల్లాపూర్‌మెట్

రాజీవ్ గృహకల్ప వద్ద ఏర్పడిన గుంతలు

ప్రైవేట్ బస్సుల్లో ప్యానిక్ బటన్లు

- అక్టోబర్ 1 నుంచి వాహనాల తనిఖీలు
- ఫ్లై ఓవర్లపైకి సరుకు రవాణా వాహనాలకు నో ఎంట్రీ
- సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి వెల్లడి

సీసీటీవీ, డ్యాష్ కెమెరాలు తప్పనిసరి



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ బస్సులలో ప్యానిక్ బటన్లు, సీసీటీవీ, డ్యాష్ బోర్డ్ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. శుక్రవారం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ప్రైవేట్ బస్సు ట్రావెల్ ఏజెన్సీలతో సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీసులు, ఇతర విభాగం అధికారులతో కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సు డ్రైవర్లు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు తమ డ్రైవర్ల నైపుణ్యాలు, సర్వీస్ నాణ్యతలను క్రమం తప్పకుండా మెరుగుపర్చుకోవాలని, ఈ మేరకు ప్రయాణికుల నుంచి అభిప్రాయాన్ని సేకరించాలని సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి మాట్లాడుతూ.. అక్టోబర్ 1 నుంచి బస్సుల ఫిట్‌నెస్‌లను తనిఖీలు చేపడతామన్నారు. వాహనాల్లో గ్యాస్ స్టవ్‌లు, వంట సామగ్రి వంటివి నిషేధించాలని బస్సు ఆపరేటర్లకు సూచించారు. బస్సు యజమానులు డ్రైవర్లు, క్లీనర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. మహిళా ప్రయాణికుల భద్రతను పెంపొందించేందుకు బోర్డులో మహిళా సహాయకురాలని నియమించుకోవాలన్నారు. అత్యవసర సేవల ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని సూచించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డీ జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉదయం 7:30 నుంచి రాత్రి 10:30 వరకు అంతర్రాష్ట్ర ప్యాసింజర్ బస్సులకు అనుమతి లేదని తెలిపారు. పటాన్‌చెరు నుంచి బీహెచ్‌ఈఎల్ జంక్షన్ వరకు ఇంటర్‌సిటీ ప్రైవేట్ బస్‌లతో పాటు టీజీఆర్టీసీ, ఇతర ఆర్టీసీలకు చెందిన ప్రజా రవాణా వాహనాలకు మినహాయింపు ఉంటుందన్నారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, సైబర్ టవర్స్ ఫ్లైఓవర్, ఫోర్ మాల్ ఫ్లై ఓవర్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ వంటి ఫ్లై ఓవర్లపై అన్ని రకాల సరకు రవాణా వాహనాలు, భారీ, నెమ్మదిగా కదిలే వాహనాలకు అనుమతి లేదని తెలిపారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, ఇతరత్రా నిషేధిత పార్సిళ్లను ప్రైవేట్ బస్సులలో రవాణా చేయకూడదన్నారు. ప్రయాణికుల లగేజీలను స్కానర్లతో తనిఖీ చేయాలని, అనుమానాస్పద కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాచకొండ ట్రాఫిక్ డీసీపీ వీ శ్రీనివాసులు, అదనపు డీసీపీలు రవిచందన్ రెడ్డి, వీరన్న, ఏసీపీలు వెంకటయ్య, శ్రీనివాస్, టీజీఆర్టీసీ ఈడీ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపాలి



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

అత్తాపూర్: నిబంధనలను లోబడి అనుమతులు తీసుకున్న ఇంటి నిర్మాణాలను, అపార్ట్‌మెంట్లను హైడ్రా పేరుతో కూల్చివేత కార్యక్రమాన్ని ఆపాలని అత్తాపూర్ లక్ష్మీనగర్ వాసులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకునేంత వరకు తాము పోరాడుతూనే ఉంటామని అన్నారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టలేదని రైతుల పట్టా భూములు, వ్యవసాయ క్షేత్రంలోనే అన్ని రకాల అనుమతులతో మూసీ రివర్‌కు దూరంలోనే నిర్మాణాలు చేపట్టామన్నారు. కూల్చివేత కార్యక్రమం జరిగితే 750 కుటుంబాలు, అభాగ్యులు అవుతారన్నారు. కార్యక్రమంలో పెరల్ హైట్స్ అపార్ట్‌మెంట్స్, సిలికాన్ నందనవనం రెడ్జ్, అంబియన్స్ పోర్టు వాసులు పాల్గొన్నారు.

బురిడీ బాబా ఆటకట్టు!

- నగరంలో తిష్టవేసిన నారాయణ్‌పేట్‌వాసి
- భార్యభర్తల్ని విడగొట్టి వారి కుమార్తెకు ఎర
- మోసంతో ఆమెను రెండో పెళ్లి చేసుకున్న వైనం
- ప్రభుత్వం నుంచి వచ్చిన పరిహారం సైతం స్వాహా
- నిందితుడి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: సామాన్యులకు మాయమాటలు చెబుతూ, మంత్రాలు–చేతబడులకు విరుగుడు పేరుతో మోసాలకు పాల్పడుతున్న నకిలీ బాబాను సౌత్–ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి నుంచి బ్లాక్ మేజిక్ చేయడానికి వినియోగించే చిత్రపటాలు, తాయత్తులు, తాళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, నారాయణ్‌పేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇలియాస్ అహ్మద్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. 2012లో నగరానికి వలస వచ్చిన ఇలియాస్ అహ్మద్ బాబాగా అవతారం ఎత్తాడు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తొలగిస్తానని ప్రచారం చేసుకుంటూ అనేక మందిని మోసం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బేగంబజార్ ప్రాంతానికి చెందిన ఓ జంటతో అతడికి పరిచయం ఏర్పడింది. వారికి మాయమాటలు చెప్పిన ఇలియాస్ భార్యభర్తల్ని విడగొట్టాడు. ఆ మహిళను తన భక్తురాలిగా మార్చుకుని ఆమె నుంచి భారీ మొత్తం వసూలు చేశాడు. ఆమె కుమార్తెపై కన్నేసిన ఈ బురిడీ బాబా పూజల పేరుతో లోబరుచుకున్నాడు. తల్లితో పాటు తన కుటుంబానికీ విషయం తెలియకుండా సదరు యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. అయినా ఆమెను తల్లి వద్దే ఉంచాడు. అనారోగ్య కారణాలతో ఆ యువతి కొన్ని నెలల క్రితం మృతి చెందింది. ప్రభుత్వం అందించిన పరిహారం ఆమె బ్యాంకు ఖాతాలో జమకావడంతో ఇలియాస్ ఆ మొత్తాన్ని తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. కుమార్తె బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం కావడంతో ఆరా తీసిన మహిళ అసలు విషయం గుర్తించి నిలదీద్దామని ప్రయతిస్తే ఇలియాస్ తన మకాం మార్చేశాడు. అనేక చోట్ల తిరిగి ఇతగాడు రెండు నెలల క్రితం బండ్లగూడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మకాం పెట్టాడు. మళ్లీ మాయలు, మంత్రాల పేరుతో దందా మొదలెట్టాడు. ఇతడి వ్యవహారంపై సమాచారం అందుకున్న సౌత్–ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం రంగంలోకి దిగింది. ఇన్‌స్పెక్టర్ కేఎస్ ప్రసాద్‌వర్మ నేతృత్వంలోఎస్సైలు ఎం.మధు, కవియుద్దీన్, పి.సాయిరాం శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి ఇంటి నుంచి అనుమానాస్పద సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడిని బండ్లగూడ పోలీసులకు అప్పగించారు.